సాక్షి
ఖమ్మం
ఆదివారం । 17 । నవంబర్ । 2024



కళలతో చైతన్యం
రుగ్మతలను రూపుమాపేలా కళారూపాలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావొచ్చని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. 8లో



ఎర్రుపాలెం టు అమరావతి!
ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు రైల్వేలైన్ నిర్మించనుండడంతో ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 15లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 19°

వాతావరణం
జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. ఉదయం, సాయంత్రం మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

చేపపిల్లలు మరిన్ని..

- జిల్లాకు అదనంగా 1.07 కోట్ల పిల్లల కేటాయింపు
- 276 చెరువులు, రిజర్వాయర్లలో వదలాలని నిర్ణయం
- వరదల నేపథ్యాన ప్రత్యేకంగా మంజూరు
- సమయం లేనందున పెద్దసైజ్‌వి మాత్రమే ఎంపిక



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని జలాశయాల్లో ఇప్పటికే వదిలిన చేపపిల్లలకు తోడు అదనంగా 1.07 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. అయితే, నీరు పుష్కలంగా ఉన్న జలాశయాల్లో మాత్రమే వదలాలని ఆదేశాల్లో పేర్కొనగా.. గతంలో మాదిరి రెండు సైజ్‌ల్లో కాకుండా ఒకే సైజ్ పిల్లలను వదులుతారు. దీంతో జిల్లాలోని 276 పెద్ద చెరువులు, రిజర్వాయర్ల పరిధిలో మత్స్యకారులకు లబ్ధి జరుగుతుందని భావిస్తున్నారు.

కొనసాగుతున్న మొదటి దశ

ఈ ఏడాది జిల్లాలోని 876 చెరువులు, జలాశయాల్లో రూ.4కోట్ల విలువైన 3.50 కోట్ల చేపపిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న మత్స్య శాఖ టెండర్లు ఆహ్వానించింది. ఆతర్వాత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 50 శాతం చేపపిల్లలే పంపిణీ చేయాలని సూచించింది. దీంతో తొలుత రూపొందించి అంచనాలను సవరించి జిల్లాలో రూ.2 కోట్ల విలువైన 1.75 కోట్ల చేప పిల్లల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు రెండు సైజ్‌ల్లోని చేపపిల్లలను 750 జలాశయాల్లో విడుదల చేయగా, ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

వరదల కారణంగా ప్రాధాన్యత

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జిల్లాను వరదలు ముంచెత్తాయి. దీంతో అనేక జలాశయాలకు వరద పోటెత్తగా పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. దీంతో మత్స్య సంపద బయటకు కొట్టుకుపోయింది. చేపల పెంపకం, వేటతో ఉపాధి పొందుతున్న తాము తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వానికి వినతులు వెల్లువెత్తాయి. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోని పాలేరు రిజర్వాయర్ సైతం ఉప్పొంగడంతో చేపపిల్లలు కొట్టుకుపోయిన విషయం ఆయన దృష్టికి వచ్చింది. దీంతో మంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాకు తొలిదశలో కేటాయించిన చేప పిల్లలకు తోడు వంద శాతం సబ్సిడీపై రెండో విడతగా మరో 1.07 కోట్ల చేప పిల్లల పంపిణీకి అనుమతి జారీ చేయించారు.

త్వరలోనే పంపిణీకి కసరత్తు

జిల్లాలో చిన్నాపెద్ద కలిపి 876 చెరువులు, రిజర్వాయర్లు ఉండగా రెండో దశలో మంజూరైన చేపపిల్లలను నీటి వనరులు కలిగిన 276 జలాశయాల్లోనే వదలాలని మత్స్యశాఖ అధికారులు నిర్ణయించారు. పెద్ద చెరువులు, రిజర్వాయర్లలో 80–100 మి.మీ.ల సైజ్ కలిగిన చేప పిల్లలను విడుదల చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా జిల్లాకు ఈ ఏడాది రెండు విడతల్లో కలిపి 2.82 కోట్ల చేపపిల్లలు మంజూరు చేసినట్లయింది.

మొదటి దశలో చేపపిల్లల పంపిణీ ఇలా..

సైజ్	చేపపిల్లల సంఖ్య	ఇప్పటివరకు పంపిణీ
80–100 మి.మీ.	1.07 కోట్లు	89.80 లక్షలు
35–40 మి.మీ.	68 లక్షలు	60 లక్షలు

పెద్దసైజ్ పిల్లలు మాత్రమే..

జిల్లాకు రెండో విడతగా ప్రత్యేకంగా చేప పిల్లలు మంజూరయ్యాయి. అయితే, మొదటి దశలో జలాశయాల సామర్థ్యం ఆధారంగా రెండు సైజుల్లో పిల్లలను విడుదల చేస్తున్నారు. కానీ ఇప్పుడు సమయం మించిపోయిన నేపథ్యాన చిన్నసైజ్ పిల్లలు వదిలితే ఎదగడానికి చాలా సమయం పడుతుందని మత్స్యకారులు విన్నవించారు. దీంతో 35–40 మి.మీ.ల చేప పిల్లలు కాకుండా కేవలం 80–100 మి.మీ. సైజ్ పిల్లలను మాత్రం సమృద్ధిగా నీటి వనరులు ఉన్న జలాశయాల్లో విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

జిల్లాకు ప్రత్యేక కేటాయింపు

మత్స్యకారుల ఉపాధి, ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జిల్లాకు రెండోసారి అదనంగా చేప పిల్లలను మంజూరు చేసింది. 80–100 మి.మీ. సైజ్‌లోని 1.07 కోట్ల చేపపిల్లల పంపిణీకి అనుమతి లభించింది. త్వరలోనే నిర్దేశించిన జలాశయాల్లో చేప పిల్లలను వదులుతాం.
– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

వడ్డీ బకాయిలు విడుదల



- ఉమ్మడి జిల్లాలో 6,757 ఎస్‌హెచ్‌జీలకు లబ్ధి
- రూ.2.56 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- గత డిసెంబర్‌కు ముందు బకాయిలపై స్పష్టత ఇవ్వని వైనం

ఖమ్మంమయూరిసెంటర్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంజూరు చేస్తున్న బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించి వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయమై ప్రభుత్వం నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయానికి లేఖ అందింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి బకాయిలు మంజూరు చేస్తున్నట్లు ఈ లేఖలో వెల్లడించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 6,757 సంఘాలకు గాను రూ.2,56,72,739 విడుదల కాగా, ఈ నిధులను వడ్డీ లేని రుణాలకు అర్హత పొందిన సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు.

ఇప్పటివరకు నాలుగు నెలల బకాయిలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించి బకాయిలను విడుదల చేస్తోంది. గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి బకాయిలు ఈ ఏడాది మార్చిలో విడుదలయ్యాయి. తాజాగా ఫిబ్రవరి, మార్చి నెలల వడ్డీ బకాయిలు మంజూరయ్యాయి. గతంలో డిసెంబర్ నెలకు గాను 14,404 ఎస్‌హెచ్‌జీలకు రూ.3,90,76,000, జనవరి నెల బకాయిలు 13,904 ఎస్‌హెచ్‌జీలకు రూ.3,75,06,000ను మంజూరు చేసింది. అవి సభ్యుల ఖాతాల్లోకి చేరాయి.

తగ్గుతున్న సంఘాలు

ఖమ్మం జిల్లాలో 25 వేలకు పైగా స్వయం సహాయక సంఘాలు ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో వడ్డీ లేని రుణాలకు కేవలం 3,983 ఎస్‌హెచ్‌జీలు మాత్రమే అర్హత సాధించాయి. దీంతో ఆయా సంఘాలకు ప్రభుత్వం రెండు నెలల(ఫిబ్రవరి, మార్చి) బకాయిలు రూ.1,65,57,032 విడుదల చేసింది. ఇక భద్రాద్రి జిల్లాలో 23 వేలకు పైగా సంఘాలు ఉన్నప్పటికీ 2,774 సంఘాలు మాత్రమే అర్హత సాధించాయి. ఈ మేరకు సంఘాలకు రూ.91,15,701 బకాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో 90 శాతం మేర సంఘాలు వీఎల్‌ఆర్‌కు అర్హత సాధించేవి. కొంతకాలంగా పలు సంఘాల సభ్యులు రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న వడ్డీ లేని రుణ పథకానికి దూరమవుతున్నాయి. అధికారులు సైతం అవగాహన కల్పించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోందనే విమర్శలు ఉన్నాయి.

పాత బకాయిల మాటేమిటి?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. అన్నట్లుగానే అధికారంలోకి రావడంతో గత ఏడాది డిసెంబర్ నుంచి బకాయిలను మహిళా సంఘాల సభ్యులకు చెల్లిస్తోంది. ఇలా ఇప్పటివరకు నాలుగు నెలల బకాయిలు చెల్లించినప్పటికీ అంతకు ముందు బకాయిలపై ప్రకటన చేయకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2019 – 20 నుంచి వేలాది సంఘాలకు వడ్డీ బకాయిలు పేరుకుపోవడంతో వాటిని విడుదల చేస్తుందా లేదా అనే అయోమయం సంఘాల్లో నెలకొంది. అంతేకాక ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బకాయిలు కూడా అందాల్సి ఉంది.

న్యూస్‌రీల్

రిజర్వేషన్ దామాషాపై నేడు బహిరంగ విచారణ

ఖమ్మంమయూరిసెంటర్: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషాపై బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు ఆధ్వర్యాన ఆదివారం బహిరంగ విచారణ చేపట్టనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 11–30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగే విచారణలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన కుల సంఘాలు, సంస్థల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై అభిప్రాయాలు తెలపాలని బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి సూచించారు. కులాల స్థితిగతులపై వ్యక్తులు, అసోసియేషన్ల బాధ్యులు స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొంటూ విషయంలో అభ్యర్థనలు, సలహాలను కమిషన్‌కు అందజేయొచ్చని ఆమె తెలిపారు.

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా రెండు తెలుగు రాష్ట్రాల భారీగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

ఈనెల 24న స్కాలర్‌షిప్ పరీక్ష

ఖమ్మంసహకారనగర్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఈనెల 24న జరగనుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ నెల 24న ఆదివారం ఉదయం 9–30నుండి మధ్యాహ్నం 12–30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను https://bse.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.


23న దివ్యాంగుల క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: దివ్యాంగులకు ఈనెల 23న క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అంధులకు పరుగు పందెం, షాట్‌పుట్, చెస్ పోటీలు, శారీకక దివ్యాంగులకు ట్రై సైకిల్ తదితర అంశాలో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. జూనియర్, సీనియర్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించనుండగా సదరం సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు.

21న 'స్పోర్ట్స్' అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024లో స్పోర్ట్స్ కేటగిరీ అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 21న హైదరాబాద్‌లో పరిశీలిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. హైదరాబాద్ దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో జరిగే పరిశీలనకు హాజరయ్యేలా జిల్లా నుంచి 21 మంది అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని వెల్లడించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని డీఈఓ సూచించారు.

జలవనరుల శాఖ ఎస్‌ఈగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

ఖమ్మంఅర్బన్: ఎట్టకేలకు జలవనరుల శాఖ ఖమ్మం సర్కిల్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా పాలేరు ఈఈ మంగళపుడి వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఎస్‌ఈగా ఉన్న నర్సింగరావు అక్టోబర్ 30న ఉద్యోగ విరమణ చేశాక ఎవరినీ నియమించకపోగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించలేదు. ఈనేపథ్యాన పనులు పెండింగ్‌లో ఉండడం, నియామకంలో జాప్యంపై రకరకాల ప్రచారాలు జరుగుతుండడంతో పాలేరు ఈఈని ఇన్‌చార్జ్‌గా నియమించారు.

గ్రూప్–3 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- నేడు రెండు, రేపు ఒక సెషన్‌లో పరీక్ష



కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. ఉద్యోగులు కూడా ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. చింతకాని మండలం రామకృష్ణాపురంలోని సెయింట్ థెరిస్సా పాఠశాల, ఖమ్మం విస్‌ఫీల్డ్ పాఠశాల, ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని దరిపెల్లి అనంతరాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, పెద్దతండాలోని ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తదితర కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ మాట్లాడారు. కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ అధికారులు, ప్రాంతీయ కో–ఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటూ పరీక్ష పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఈవిషయంలో సందేహాలు ఎదురైతే వెంటనే ప్రాంతీయ కో–ఆర్డినేటర్ల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతీ గదిలో 24 మంది అభ్యర్థులు మాత్రమే కూర్చునేలా ఏర్పాట్లు చేసినందున ఇన్విజిలేటర్లు నిశితంగా పరీక్షించాలని తెలిపారు. ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు స్టీఫెన్, పుల్లారావు, కిరణ్, గోపాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 87 కేంద్రాలు

గ్రూప్–3 పరీక్షలు ఆది, సోమవారం జరగనున్నాయి. జిల్లాలో 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 27,984 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మొదటి రోజైన ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇక సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం పరీక్షకు 8–30 నుంచి 9–30గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు 1–30నుంచి 2–30 గంటల వరకే అనుమతించి ఆతర్వాత గేట్లకు తాళాలు వేస్తామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, అభ్యర్థులు ముందుగానే చేరుకోవాలని సూచించారు. కాగా, చెప్పులు మాత్రమే ధరించి రావాలని తెలిపారు. ప్రతిఒక్కరు బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్‌టికెట్, ఫొటోతో జారీ చేసిన ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్ తీసుకురావాలని పేర్కొన్నారు. ఒకవేళ హాల్ టికెట్‌లో ఫొటో సరిగ్గా లేకపోతే మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకురావాలని అధికారులు సూచించారు.

వైరా నదిపై చెక్‌డ్యామ్‌కు నిధులు

రూ.6.85 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు

మధిర: మధిర మండలంలోని సిరిపురం వద్ద వైరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.85కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈమేరకు శనివారం పరిపాలన అనుమతులు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29న చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.4.71 కోట్లు కేటాయించారు. అయితే, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యాన మరో మారు పరిశీలించి ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు చేశారు. ఈమేరకు కొత్త అంచనాల ప్రకారం రూ.6,85,20,000 మంజూరు చేయాలని నివేదిక సమర్పించగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొనసాగుతున్న అథ్లెటిక్స్ టోర్నీ



హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–14 బాలాబాలికల అథ్లెటిక్స్ టోర్నీ శనివారం రెండో రోజుకు చేరింది. ఉమ్మడి పది జిల్లాల వారీగా క్రీడాకారులు హాజరు కాగా ఓవరాల్ చాంపియన్ షిప్ కోసం నువ్వా, నేనా అన్నట్లు తలపడుతున్నారు. కాగా, ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని సంఘం జిల్లా కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు.

రెండో రోజు ఫలితాలు..

బాలుర విభాగం నుంచి హైజంప్‌లో జె.శ్రీకాంత్(మెదక్), ఏ.దిలీషన్(మహబూబ్‌నగర్), జె.లిఖిత్(రంగారెడ్డి), 400 మీటర్ల పరుగులో కె.సాయిఆదిత్య(రంగారెడ్డి), కె.నరేష్(ఆదిలాబాద్), కె.జాకేష్(ఆదిలాబాద్), 100 మీటర్ల పరుగులో ఆర్.కార్తీక్(ఆదిలాబాద్), ఎం.ముత్తు(మహబూబ్‌నగర్), వి.కుమార్‌రెడ్డి(రంగారెడ్డి) లాంగ్‌జంప్‌లో కె.ప్రవీణ్(నల్లగొండ), ఎ.దిల్షాన్(మహబూబ్‌నగర్), కె.శ్రీధిరెడ్డి(మెదక్) మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు. ఇక బాలికల విభాగం నుంచి షాట్‌పుట్‌లో ఏ.వినూత్న(హైదరాబాద్), ఎస్.సమంత(వరంగల్), జి.ధాన్య(మెదక్), హైజంప్‌లో ఎస్.సహారా(ఆదిలాబాద్), కె.సాయిశ్రీ(రంగారెడ్డి), కె.శ్రీదితిరెడ్డి(మెదక్), 400 మీటర్ల పరుగులో ఏ.జాహ్నవి(కరీంనగర్), ఎం.రాజేశ్వరి(వరంగల్), టి.ధాన్య(హైదరాబాద్), డిస్కస్ త్రోలో ఏ.వినూత్న(హైదరాబాద్), జి.ధాన్య(మెదక్), మధుప్రియ(ఖమ్మం), 100 మీటర్ల పరుగులో జి.నక్షత్ర(కరీంనగర్), వై.శృతిహాసన్(ఖమ్మం), ఎ.శైలజ(ఆదిలాబాద్) వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు



ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షిస్తున్న డీఏఓ పుల్లయ్య

తల్లాడ: దళారుల మాయమాటలను రైతులు నమ్మి ధాన్యం విక్రయించి మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లోనే అమ్మడం ద్వారా మద్దతు ధర పొందాలని తెలిపారు. తల్లాడ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు సరైన తేమవచ్చే వరకు ధాన్యాన్ని ఆరబెడితే ఏఈఓలు సర్టిఫికెట్ జారీ చేస్తారని, తద్వారా 24 గంటల్లోనే కాంటా వేసి మిల్లులకు తరలిస్తామని తెలిపారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా అందుతుందని చెప్పారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఏఓ తాజుద్దీన్, ఏఈఓలు పాల్గొన్నారు.

కేంద్రాల్లో పరిశీలించిన డీఎం

వేంసూరు: వేంసూరు, మర్లపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు రైతులు సన్నరకమైన 1224ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవడం లేదని తెలిపారు. వేంసూరు మండలంలో అత్యధికంగా ఇదే రకం సాగు చేసినట్లు చెప్పగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఎం చెప్పారు. సొసైటీల సీఈఓలు శ్రీను, చెన్నారెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాల అమలులో తాత్సారం చేయొద్దు..

- తేమ కొర్రీలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి
- 19న లగచర్లలో బాధితులను పరామర్శిస్తాం..
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలపై తాత్సారం విడనాడి ఇకనైనా అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14, 15, 16వ తేదీల్లో నిర్వహించిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో వివిధ సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తవుతున్నా ఒకటి, రెండు మినహా మిగతావి అమలు చేయలేదన్నారు. ఇకనైనా అన్ని రకాల వరి ధాన్యం బోనస్ ప్రకటించడంతో పాటు కొర్రీలు లేకుండా అన్ని సెంటర్లలో పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఉచితగ్యాస్, కరెంట్ వినియోగదారులందరికీ వర్తింపచేయాలన్నారు. కాగా, మహాలక్ష్మితో పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలనే డిమాండ్‌తో వచ్చేనెల 4న రాష్ట్రంలోని అన్ని డిపోలతో పాటు హైదరాబాద్ బస్ భవన్ ఎదుట ధర్నా చేయనున్నామని రంగారావు తెలిపారు. అలాగే, లగచర్ల తదితర గ్రామాల్లో పోలీసులు అక్రమ అరెస్టులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న లగచర్లలో తమ పార్టీ బృందం పర్యటించి బాధితులను పరామర్శిస్తుందని తెలిపారు. ఇక కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్వేషాలను రెచ్చగొడుతూ, ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో ఆదివాసీలను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారని రంగారావు తెలిపారు. నాయకులు కేజీ.రాంచందర్, కె.రమ, కెచ్చల రంగయ్య, గోకినపల్లి వెంకటేశ్వరరావు, చిన్న చంద్రన్న, గుమ్మడి నర్సయ్య, వి.కృష్ణ, వి.ప్రభాకర్, సదానందం, కె.సూర్యం, ఎం.కృష్ణ, చంద్ర అరుణ, గుర్రం అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటు పుట్టిలో లాహిరి.. లాహిరి..

- కిన్నెరసాని కాలువలో తెడ్డుతో నడిపే పడవ
- ట్రయల్ రన్ పరిశీలన
- మత్స్య సహకార మహిళా సంఘాల ద్వారా నిర్వహించాలని సూచన



నాటు పుట్టిలో ట్రయల్ రన్ చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కిన్నెరసాని వెళ్లే పర్యాటకులు జలాశయంలో బోటింగ్‌కు ఉత్సాహం చూపిస్తారు. ప్రస్తుతం ఇది కొనసాగుతుండగా ఇకపై కిన్నెరసాని జలాశయం నుంచి కేటీపీఎస్ కర్మాగారానికి ప్రవహించే కాల్వలోనూ లాహిరి.. లాహిరిలో అంటూ తెడ్డు ద్వారా నడిపే నాటు పుట్టిలో విహరించే అవకాశం లభించనుంది. ఈమేరకు కాల్వను శనివారం పరిశీలించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.. మణుగూరు మండలం కొండాయిగూడెం నుంచి నాటు పుట్టిని తెప్పించి ట్రయల్‌రన్ వేయించారు. నాటు పుట్టి నిర్వహణ బాధ్యతను కిన్నెరసాని, పునుకుల గ్రామ మత్స్య సహకార సొసైటీ సభ్యుల భార్యలతో ఏర్పాటు చేసిన మహిళాశక్తి సభ్యులకు అప్పగించాలని సూచించారు. తద్వారా వారు స్వయం సమృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. నాటు పుట్టిలో నడిపే ఇద్దరితో పాటు నలుగురు పర్యాటకులు కూర్చునే వీలుంటుందని, కాల్వలో 200 మీటర్ల దూరం తీసుకెళ్లి, తిరిగి తీసుకొచ్చేందుకు రూ.50 చొప్పున వసూలు చేయాలని, పది రోజుల్లో నాటు పుట్టి నిర్వహణ మొదలుపెట్టాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు.

డ్యామ్‌పైకి పర్యాటకులను అనుమతించాలి..

కొంతకాలంగా కిన్నెరసానికి వచ్చే పర్యాటకులు డ్యామ్‌పైకి వెళ్లకుండా కేటీపీఎస్ అధికారులు గేటుకు తాళం వేయడంతో నిరాశ చెందుతున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌రావుకు ఫోన్ చేసి డ్యామ్ పైకి పర్యాటకులను అనుమతించాలని ఆదేశించారు. దీంతో ఆదివారం నుంచి డ్యామ్ పైకి పర్యాటకులను అనుమతిస్తామని సీఈ చెప్పారు. కాగా, కిన్నెరసాని పరిసరాలు, రిజర్వాయర్‌లో ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులు, వ్యర్థాలు పడేస్తుండడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉంటున్నాయని కేటీపీఎస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో డ్యామ్‌పైన, డీర్ పార్కు వద్ద చెత్త బుట్టలు ఏర్పాటుచేయాలని, పర్యాటకులు వ్యర్థాలను వాటిలోనే వేసేలా అవగాహన కల్పించాలని వైల్డ్ లైఫ్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట కేటీపీఎస్ ఎస్‌ఈ మోక్షవీర్, ఏడీఈ రామకృష్ణ, ఏఈ సురేష్, మత్స్య శాఖాధికారి ఇంతియాజ్‌ఖాన్, టూరిజం బీఎం దుర్గాప్రసాద్, ఎఫ్‌బీఓ రాములు, సిబ్బంది ఇబ్రహీం, కళ్యాణ్ ఉన్నారు.

క్లుప్తంగా

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా 'ఈశా' గ్రామీణ క్రీడోత్సవం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ, డీవైఎస్ఓ

ఖమ్మం స్పోర్ట్స్: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి గ్రామీణ క్రీడోత్సవాలు శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్ ప్రారంభించి మాట్లాడుతూ యువజనులు క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా ఈశా ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, వాలీబాల్ కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ, నిర్వాహకులు ప్రియాంక, నవీన్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తుండగా వాలీబాల్ పోటీల్లో 32 జట్లు, త్రోబాల్‌కు 24 జట్లు పాల్గొంటున్నాయి.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



మృతదేహాల వద్ద అన్నం ఫౌండేషన్ చైర్మన్

ఖమ్మంవైద్యవిభాగం: ఇటీవల ఖమ్మం రైల్వేస్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలను మార్చురీలో భద్రపరిచారు. అయితే, వీరి కోసం ఎవరూ రాకపోవడంతో రైల్వే పోలీసులు, ఆస్పత్రి అధికారులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాలకు బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కళలతో సమాజంలో చైతన్యం

- డీఎంహెచ్ఓ కళావతిబాయి
- మధిరలో ముగిసిన జాతీయస్థాయి బాలోత్సవ్

మధిర: సమాజంలో నెలకొన్న రుగ్మతలను తొలగించేందుకు కళలు దోహదపడతాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. మధిరలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మండపంలో రెండు రోజులుగా రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాలోత్సవ్ శనివారం ముగిసింది. ఈమేరకు కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ చిన్నారులను దాగి ఉన్న కళలు, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. అంతరించిపోతున్న కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నిర్వర్తిస్తున్న కళాపరిషత్ బాధ్యులు అభినందనీయులని తెలిపారు. ఇక్కడ పిల్లలు ప్రదర్శించిన కళారూపాలను చూస్తుంటే తన చిన్నతనం గుర్తుకొచ్చిందని తెలిపారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మిమిక్రీ కళాకారుడు, హెల్త్ సూపర్‌వైజర్ లంకా కొండయ్య ఆధ్వర్యాన పాత వస్త్రాలతో చేయించిన సంచులను విడుదల చేశారు. కళాపరిషత్ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, గౌరవ సలహాదారుడు పారుపల్లి సురేష్, కార్యదర్శి బాబ్లా, రంగస్థల కళాకారులు ఏటూరి హరినాథ్, టి.నాగిరెడ్డి, సోనీబాయ్, గాయని బేగం తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వల్ల అనర్థాలపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని



అల్లూరి సీతారామరాజు వేషధారణలో..



రాణి రుద్రమదేవి పాత్రలో విద్యార్థిని

ఆకట్టుకున్న ప్రదర్శనలు

జాతీయ స్థాయి బాలోత్సవ్‌కు రెండు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి బాలలు హాజరయ్యారు. రెండో రోజు ఏకపాత్రాభినయనం పోటీలు నిర్వహించగా జాతీయ నాయకుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు, రాణి రుద్రమదేవి తదితరుల వేషధారణల్లో విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శన ఆహుతులను అలరించింది. కాగా, ఓ విద్యార్థి ప్లాస్టిక్ వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరిస్తూ ప్లాస్టిక్ కవర్లు, పాత బాటిళ్లతో రూపొందించిన వస్త్రాలు ధరించి ఇచ్చిన ప్రదర్శన ఆలోచింపచేసింది.

రాష్ట్ర అండర్–19 కరాటే పోటీలు ప్రారంభం

వివిధ ప్రాంతాల నుంచి 250మంది క్రీడాకారుల హాజరు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి అండర్–19 కరాటే పోటీలు ఖమ్మంలో శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా జూనియర్ కళాశాల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని జిమ్నాజియం హాల్‌లో ఈ పోటీలు ఏర్పాటుచేశారు. పోటీలను జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు, హోంగార్డ్ ఆర్ఐ ఎం.సురేష్, ట్రాఫిక్ సీఐ కె.సాంబశివరావు, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్ఐ ఎం.సురేష్ మాట్లాడుతూ క్రీడల ద్వారా వ్యక్తిగతంగా విజయాలు సాధించడమే కాక దేశ ఖ్యాతిని చాటే అవకాశముంటుందని తెలిపారు. విద్యార్థుల్లో పతకాలు సాధించాలనే పట్టుదల కనిపిస్తోందని, నిరంతరం శిక్షణ కొనసాగించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. డీఐఈఓ రవిబాబుబు మాట్లాడుతూ పోటీలకు పాత పది జిల్లాల నుంచి 250మంది బాలబాలికలు హాజరయ్యారని తెలిపారు. కాగా, పోటీల్లో క్రీడాకారులు నువ్వా, నేనా అన్నట్లు తలపడగా తొలిరోజు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ గోపతి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ సాంబశివరావు, డీఐఈఓ రవిబాబు, ఆర్ఐ సురేష్ తదితరులు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

టీపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగేశ్వరరావు, విజయ్

ఖమ్మంసహకారనగర్: టీపీటీఎఫ్ జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శనివారం జిల్లా కౌన్సిల్‌లో ఈ ఎన్నిక జరిగింది. ఈమేరకు 21 మండలాల నుండి ప్రతినిధులు హాజరుకాగా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏ.వీ.నాగేశ్వరరావు, విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, సంధ్యారాణి, యాకూబ్‌పాషా, జి.వెంకటేశ్వరరావు, బావ సన్, హన్మంతరావు, కార్యదర్శులుగా టి.వెంగళరావు, ఎం.నాగిరెడ్డి, ఏ.నాగేశ్వరరావు, ఉమాదేవి, వై.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, గరిక శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఇంకా రాష్ట్ర కౌన్సిలర్లుగా ముత్తయ్య, వై.పద్మ, వీరబాబు, రమాదేవి, కె.వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రాంకోటి, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా రామ్మోహన్‌రావు, జీఓల కమిటీ కన్వీనర్‌గా పి.రాములు ఎన్నుకున్నారు. రెండేళ్ల కాలానికి గాను ఈ కమిటీని ఎన్నుకోగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం నాలుగు పెండింగ్ డీఏలను విడుదల, పీఆర్సీ ప్రకటన, సీపీఎస్ రద్దు, కేజీబీవీ, ఐటీడీఏ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చడంతో పాటు ఒకే రకమైన విద్య ఉండాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ నాయకులు మనోహర్ రాజు, రామారావు, రవికుమార్ పాల్గొన్నారు.



నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు



విజయ్, ప్రధాన కార్యదర్శి

లగచర్ల ఘటన బీఆర్ఎస్ కుట్రే...

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై లగచర్లలో జరిగిన దాడి వెనుక బీఆర్ఎస్ నేతల కుట్ర ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆరోపించారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ కుట్ర పన్నగా, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సూచనలతో పలువురు రైతుల ముసుగులో కలెక్టర్, అధికారులపై దాడి చేశారని విమర్శించారు. ఈఘటనలో 15 మందికి పైగా రైతులు కాని వారు పాల్గొన్నట్లు తేలిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిపోయిన ప్రజలు తమకు పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఖమ్మంలో మిర్చి ధర పెంచాలని శాంతియుతంగా ఆందోళన చేసిన రైతుల చేతులకు సంకెళ్లు వేసి జైలుకు తరలించారని ఆరోపించారు. ఇప్పుడు రైతులపై కపటప్రేమ చూపెతూ తమ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని ఆమె హెచ్చరించారు. అనంతరం కల్లూరు, పెనుబల్లి మండలాలకు చెందిన 123 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాగమయి అందజేశారు. ఈ సమావేశంలో కల్లూరు మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, తోట సుజలరాణి, పసుమర్తి చందర్‌రావు, గాదె చెన్నారావు, ఎం.డీ.గఫార్‌ఖాన్, పద్మజ్యోతిరెడ్డి, కంటే నాగలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి, పక్కన నాయకులు

దైవదర్శనానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడు మృతి
- ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన భార్య

చంద్రుగొండ/ఎర్రుపాలెం: కుటుంబ పెద్ద అయ్యప్ప మాల ధరించాడు.. భార్య, కుమారుడితో కలిసి భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు.. స్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో తండ్రీకుమారుడు మృతి చెందగా ఆయన భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో తండ్రి, సోదరుడు మృతి చెంది, తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారి కుమార్తె ఒంటరిగా మిగిలిపోయింది. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద శనివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

కొత్తపాలెం టు భద్రాచలం

ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన చిలుమూరు సతీష్‌కుమార్‌శర్మ(43) అయ్యప్ప మాల ధరించాడు. అశ్వాపురంలోని సాయిబాబా ఆలయంలో రెండేళ్లు, లక్ష్మీపురంలోని సాయిబాబా ఆలయంలో ఏడాది పాటు పూజారిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఎర్రుపాలెం మండలం కొత్తపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకత్వం చేస్తున్నాడు. ఆయనకు భార్య లక్ష్మీహిమబిందు, కుమారుడు హనీశ్వర్(9)తో పాటు కుమార్తె నిత్యలక్ష్మి ఉన్నారు. ఇందులో కుమార్తె ఎర్రుపాలెం కేజీబీవీలో ఆరో తరగతి, కుమారుడు స్థానిక ఎస్వీ అకాడమీ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. కాగా, శనివారం ఉదయం భార్య, కుమారుడితో కలిసి సతీష్‌కుమార్ భద్రాచలంలో శ్రీసీతారాముల దర్శనానికి బైక్‌పై వెళ్లాడు. అక్కడ స్వామిని దర్శించుకున్నాక తిరిగి వస్తుండగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. బైక్ అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా సతీష్‌కుమార్, ఆయన కొడుకు హనీశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సతీష్ భార్య లక్ష్మీహిమబిందుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై చంద్రుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదంలో తండ్రి, సోదరుడు మృతి చెందగా.. తల్లి తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో ఉండడంతో వారి కుమార్తె నిత్యలక్ష్మిని బంధువులు హాస్టల్ నుంచి తీసుకురాగా కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడం అందరినీ కంటతడి పెట్టించింది.





సతీశ్‌కుమార్‌శర్మ, హనీశ్వర్ (ఫైల్)

ఎక్వేరియంతోనే ప్రమాదమా?

బైక్‌పై ముందు సతీష్‌కుమార్‌శర్మ కుమారుడు హనీశ్వర్, వెనుకాల భార్య లక్ష్మీహిమబిందు కూర్చున్నారు. అయితే, కుమారుడి చేతిలో ఎక్వేరియం ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. పెట్రోల్ ట్యాంక్‌పై ఎక్వేరియం పెట్టుకుని కూర్చోగా బైక్ హ్యాండిల్ తిప్పలేకపోయి ఉంటాడని సమాచారం. ఈ కారణంగానే రహదారిపై ఎడమవైపు వెళ్తున్న బైక్ కుడివైపు ఓ రైతు ఇంటి ముందు ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును బలంగా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. కాగా, ఘటనలో తండ్రీకుమారుడి తలలు ఛిద్రమై మృతి చెందగా, తండ్రిని హత్తుకున్నట్లు పడి ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు.

మార్కెట్ ఎదుట రైతుల ఆందోళన

పత్తి తూకంలో తేడా వచ్చిందని పోలీసులకు ఫిర్యాదు

ఏన్కూరు: ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతులు శనివారం ఆందోళనకు దిగారు. గేట్లు మూసివేసి నాలుగు గంటల పాటు ధర్నా చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గార్లఒడ్డు గ్రామానికి చెందిన నరేష్ ఓ వ్యాపారికి మార్కెట్‌లో పత్తి విక్రయించాడు. అనంతరం వ్యాపారి సూచనతో ఓ వే బ్రిడ్జి(కాంటా) వద్ద తూకం వేయించాక అనుమానంతో మరో కాంటా వద్ద తూకం వేయిస్తే 20 కేజీల తేడా వచ్చింది. దీంతో ఆగ్రహించిన నరేష్ మరికొందరితో కలిసి మార్కెట్ ఎదుట ధర్నాకు దిగారు. మార్కెట్‌లో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని ఆరోపించారు. పత్తి కొనుగోలు చేసేటప్పుడు ఒక ధర, దిగుమతి అయ్యాక ఆ ధర తగ్గిస్తున్నారని మండిపడ్డారు. అయితే, అధికారుల నుండి స్పందన లేకపోవడంతో రైతులు మండల కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సమాచారం అందుకున్న సీఐ ముత్తిలింగం, ఎస్ఐ రఫీ చేరుకుని రైతులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిస్తామని చెప్పడంతో వ్యాపారులు, వే బ్రిడ్జి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మార్కెట్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ రఫీ

ఆలయ నిర్వహణలో రెండువర్గాలు

పాల్వంచ: పాల్వంచలోని అయ్యప్ప స్వామి ఆలయ పాలకవర్గంలో రెండు గ్రూపులు ఏర్పడడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. ఓ వర్గం ట్రస్టీగా, మరో వర్గం కమిటీగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఇదిలా ఉండగా ఆలయ ఆవరణలో శుక్రవారం నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు ఫ్లెక్సీలను తొలగించారని ఎదుటి వర్గం శనివారం ఆందోళనకు దిగడం గమనార్హం. అయ్యప్పస్వామి ఆలయానికి పదేళ్లుగా కమిటీని నియమించకపోవడంతో భక్తుల డిమాండ్ మేరకు ముగ్గురికి బాధ్యతలు అప్పగించారు. అయితే, వారు కాలయాపన చేయడమేకాక ట్రస్టీగా రెండు నెలల కిందట రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో కొత్వాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ఈ విషయం తెలియడంతో మరో వర్గం నుంచి అజ్మీరా రామదాసు తదితరులు కమిటీని రిజిస్ట్రేషన్ చేయించారు. కమిటీ ఆధ్వర్యాన ఆలయంలో శుక్రవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, శనివారం ఉదయంకల్లా చించేసి ఉంది. దీంతో వారు రహదారిపై ధర్నాకు దిగగా పోలీసులు సర్దిచెప్పడంతో ఆలయం ముందు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లుగా కమిటీ వేయకపోగా, ఇప్పుడు ట్రస్టీగా మార్చారని ఆరోపించారు. నిధుల లెక్కలు చెప్పడం లేదని, భూమిని విక్రయించారని తెలిపారు.

సాయుధ పోరాట యోధురాలు రాధాంబ మృతి

కామేపల్లి: మండలంలోని పండితాపురానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పాటిబండ్ల రాధాంబ(96) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. సాయుధ తెలంగాణ పోరాటంలో పాల్గొన్న ఆమె భారత మహిళా సమాఖ్య వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన ఆమె 1950లో మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో చురుకైన పాత్ర పోషించడమే కాక మహిళల సమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టారు. రాధాంబ సోదరుడు బోడేపూడి రామకోటేశ్వరరావు సైతం కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. కాగా, ఆమె వివాహం కాంగ్రెస్ నాయకుడు పాటిబండ్ల రామలింగయ్యతో జరిగినా తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగానే కొనసాగారు. కాగా, రాధాంబ మృతదేహం వద్ద సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు నివాళులర్పించి మట్లాడారు. ఆమె మృతితో విప్లవోద్యమం అంకితభావం, నిబద్ధత కలిగిన నాయకురాలిని కోల్పోయిందని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి, నాయకులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సలీం, శతకోటి సత్యనారాయణ, ప్రభాకర్‌రావు, అంబడిపూడి జగ్గయ్య, తీర్థాల చిదంబరరావు, వడియాల కృష్ణారెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, దండగల దేవేందర్, ఉప్పుగండ్ల వీరభద్రరావు తదితరులు కూడా నివాళులర్పించారు.



రాధాంబ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పువ్వాడ, నాయకులు

కడుపునొప్పి తాళలేక విదార్థిని ఆత్మహత్య

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురానికి చెందిన పదో తరగతి విద్యార్థిని వేల్పుల భార్గవి(16)ఆత్మహత్య చేసుకుంది. ముదిగొండలోని జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న ఆమె రెండు రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి తాళలేక శుక్రవారం రాత్రి అందరూ పడుకున్నాక గడ్డి మందు తాగగా శనివారం వాంతులు, విరేచనాలు అవుతుండడంతో కుటుంబీకులు ఖమ్మం తీసుకెళ్తుండగానే మార్గమధ్యలో మృతి చెందింది. ఘటనపై భార్గవి తండ్రి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వరంగల్ వాసి...

ఖమ్మంక్రైం: ఖమ్మం మధ్యగేట్ ప్రాంతంలో రైలు కిందపడిన వరంగల్ వాసి ఆత్మహత్యే చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన వేల్పుల మురళీకృష్ణ(40) శనివారం ఖమ్మం వచ్చినట్లు సమాచారం. ఆతర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ ఆయన రైలు కింద పడగా మృతదేహం ఛిద్రమైంది. మురళీకృష్ణ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: అనుమాన స్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం బేతుపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పసుమర్తి సాంబశివరావు(32) శుక్రవారం రాత్రి రోజులాగే నిద్రించగా శనివారం ఉదయం కుటుంబీకులు నిద్ర లేపే సమయానికి మృతి చెంది ఉన్నాడు. ఆయన నిద్రలో మంచం పైనుంచి పడడంతో తలకు గాయాలై మృతి చెందినట్లు తెలిసింది. ఈఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు.



సాంబశివరావు (ఫైల్)

రాజేశ్వరపురంలో ఇరువర్గాల తోపులాట

నేలకొండపల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని రాజేశ్వరపురంలో రెండు వర్గాల మధ్య తోపులాట జరగగా అరుపులు, కేకలతో ఉద్రిక్తత నెలకొంది. పండుగ సందర్భంగా గ్రామంలో భారీ ప్రభ ఏర్పాటు చేయడంతో పాటు ఏపీ నుంచి కళాకారులను పిలిపించారు. అయితే, అనుమతి లేనందున్న నృత్యాలు చేయొద్దని పోలీసులు సూచించారు. ఈక్రమాన నిర్వాహకులు పురుషులతో ఆటపాటలు పూర్తిచేశారు. గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ వర్గీయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతోనే నృత్యాలు నిలిపివేయాల్సి వచ్చిందని వేదిక పైనుంచి మైక్ ద్వారా ఇంకో వర్గానికి చెందిన మాజీ సర్పంచ్ ఆరోపించారు. దీంతో ఇరువర్గాల వారు తోపులాటకు దిగడంతో అరుపులు, కేకలతో ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు రంగప్రవేశం చేసి చెదరగొట్టారు. ఆపై సాంస్కృతిక కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేశారు. కాగా, తమపై అసత్య ఆరోపణలు చేసి అవమానించిన నలుగురిపై చర్యలు తీసుకోవాలని పుల్లయ్య వర్గానికి చెందిన నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

భద్రాచలం వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న త్రివేణి (మధ్యలో)

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన త్రివేణి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షహరాన్‌పూర్‌లోని గ్లోకల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకుంది. ప్రొఫెసర్ క్రిషన్ పాల్ ఆధ్వర్యాన పప్పు ధాన్యాల పంటల సాగుపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు. కాగా, త్రివేణి ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తుండగా పలువురు ఆమెను అభినందించారు.

పాల్వంచ వాసి రాంకుమార్‌కు...



రాంకుమార్‌వర్మ

పాల్వంచ: పాల్వంచలోని సీతారాంపట్నంకు చెందిన దమ్మాలపాటి రాంకుమార్ వర్మకు నోయిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ లభించింది. గతంలో ఆయన అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసారు. ప్రస్తుతం ఖమ్మంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఇంగ్లిష్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఆయనకు డాక్టరేట్ రావడంపై పలువురు అభినందించారు.

ఉద్యోగులంతా విధులకు హాజరయ్యేలా చూడాలి



అధికారులతో సమీక్షలో పాల్గొన్న జీఎంలు

సింగరేణి(కొత్తగూడెం): సంస్థ వ్యాప్తంగా ఉద్యోగులందరూ విధులకు హాజరయ్యే విధంగా పర్యవేక్షించాల ని సింగరేణి జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడు, జీఎం (సివిల్) సూర్యనారాయణ సూచించారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు కుటుంబాలతో కలిపి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యాన కొత్తగూడెం నుంచి శనివారం వారు ఏరియాల వారీగా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడు తూ.. విధులకు హాజరుకాని ఉద్యోగులకు కుటుంబ సభ్యులతో కలిపి కౌన్సెలింగ్ ద్వారా సమస్యలు తెలుసుకోవాలన్నారు. అందులో వాస్తవాలు ఉంటే ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 75కంటే తక్కువ మస్ట ర్లు ఉన్న 771మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్ త్వరగా పూర్తిచేయాలని, ఆ తర్వాత క్రమశిక్షణ చర్యలు ఉంటాయనే విషయమై అవగాహన కల్పించాలని తెలిపా రు. ఈ వీసీలో వివిధ విభాగాల అధికారులు బొజ్జ రవి, సీహెచ్.వెంకయ్య, కె.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం టు అమరావతి!



ఎర్రుపాలెం రైల్వేస్టేషన్

రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- లైన్ ఏర్పాటైతే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి
- మరోవక్క జమలాపురంలో పర్యాటక అభివృద్ధిపై దృష్టి
- రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అడుగులు

ఎర్రుపాలెం: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రం నుండి ఏపీ రాజధాని అమరావతి వరకు లైన్ లైన్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నూతన లైన్ ఏర్పాటైతే తెలంగాణ – ఏపీ రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారే అవకాశముంది. అమరావతి రైల్వే లైన్‌తో పలు గ్రామాలు అనుసంధానం కానుండడం.. ఏపీ నుంచి మండలంలోని జమలాపురంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఇప్పటికే వస్తున్న భక్తులు, పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. అంతేకాక రైల్వే లైన్‌కు తోడు నాగపూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే సైతం ఎర్రుపాలెం మండలం మీదుగా వెళ్తోంది. ఇప్పటికే పనులు కూడా మొదలయ్యాయి. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధికి అడుగులు పడతాయని స్థానికులు చెబుతున్నారు.

రైల్వేలైన్ ఏర్పాటుకు కసరత్తు

ఎర్రుపాలెం నుంచి ఏపీ రాజధాని అమరావతికి వరకు నూతన రైల్వేలైన్ నిర్మాణం కోసం కేంద్రం పచ్చజెండా ఊపింది. దీంతో ఇటు తెలంగాణ, అటు ఏపీలో అవసరమైన భూసేకరణకు వేగంగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, పల్నాడు జిల్లాలో 450 హెక్టార్ల మేర భూసేకరణ చివరి దశకు చేరింది. ఎర్రుపాలెం మండల పరిధిలోని 27 ఎకరాల భూసేకరణకు ఇక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రైల్వే లైన్ ఎర్రుపాలెం, పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టిముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్లమాను, అమవరాతి, తాటికొండ, కొప్పురావూరు నూతన స్టేషన్ల మీదుగా 57 కి.మీ. మేర ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు వరకు నిర్మిస్తారు.

వ్యవసాయ భూముల ధరలకు రెక్కలు

ఏపీకి సరిహద్దు మండలంగా ఎర్రుపాలెం ఉండడంతో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక్కడ రోడ్డు వెంట ఎకరా పొలం ధర రూ.30లక్షలు మొదలు రూ.కోటి వరకు పలుకుతోంది. సామాన్యులు కొనుగోలు చేయలేని స్థితిలో ధరలు పెరిగాయి. ఖాళీ స్థలాలు రేట్లు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్నాయి. వెంచర్లలో గజం స్థలం ధర రూ.5వేల నుండి 15వేలకు పైగా పలుకుతోందని చెబుతున్నారు. ఏదిఏమైనా రైల్వేలైన్ నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు తోడు జమలాపురంలోపర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే ఇండస్ట్రియల్ పార్క్

మధిర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎంగా ఉండడంతో నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూమి కేటాయించగా, డ్రోన్ టెస్టింగ్ తయారీ కంపెనీ ప్రతినిధులు ఇటీవల పరిశీలించారు. అలాగే, జమలాపురం పుణ్యక్షేత్రంలో అటవీ అధికారులు పార్క్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు రైల్వే లైన్, నాగపూర్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం.. ఈ మండలంలో నే తెలంగాణ తిరుపతిగా పేరున్న వేంకటేశ్వర స్వామి ఆలయం ఉండడంతో మండలానికి మహర్దశ పడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

అభివృద్ధిపై నమ్మకం ఏర్పడింది..



డిప్యూటీ సీఎం భట్టి చొరవతో అభివృద్ధిపై నమ్మకం ఏర్పడింది. రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్కు, జమలాపురంలో పర్యాటక అభివృద్ధి, అటవీ పార్కు ఏర్పాటు, అన్ని గ్రామాలకు అనుసంధానంగా బీటీ రోడ్ల నిర్మాణం జరుగుతుండడం ఆనందంగా ఉంది. – శీలం ప్రతాపరెడ్డి, తక్కెళ్లపాడు

ఎర్రుపాలెంను జంక్షన్‌గా మార్చాలి..



తెలంగాణ–ఏపీ సరిహద్దుగా ఎర్రుపాలెం నుంచి ఏపీ రాజధాని అమరావతికి రైల్వేలైన్ నిర్మిస్తున్నందున జంక్షన్‌గా మార్చాలి. తద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. అలాగే, శాతవాహన, మచిలీపట్నం, పద్మావతి రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి. –శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, భీమవరం

మెరుగుపడనున్న రవాణా సౌకర్యం



నూతన రైల్వేలైన్ నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగవుతుంది. ప్రస్తుతం అమరావతికి వెళ్లాలంటే ఇబ్బందులు ఉన్నాయి. రైల్వే లైన్ నిర్మిస్తే ఆ సమస్యత తీరడమే కాక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. – మల్లెల లక్ష్మణరావు, ఎర్రుపాలెం

యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

వైరారూరల్: వైరా మండలం గొల్లపూడిలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ విభాగానికి ప్రభుత్వం ఇద్దరు యోగా ఇన్‌స్ట్రక్టర్లను కేటాయించిందని ఆయుర్వేదిక్ వైద్యుడు జె.రాజేష్ తెలిపారు. వైరా మండలం బ్రాహ్మణపల్లికి చెందిన పైల్లా పద్మావతి, మధిర మండలానికి చెందిన ఎం.కృష్ణను ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించగా వారు శనివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ మానసిక, శారీరక రుగ్మతల నుంచి ఉపశమనంతో పాటు భవిష్యత్‌లో అనారోగ్యం దరి చేరకుండా యోగా సాధన ఉపయోగపడుతుందని తెలిపారు.



విధుల్లో చేరుతున్న యోగా ఇన్‌స్ట్రక్టర్లు

గుండాల బిడ్డకు పతకాల పంట!

- కరాటేలో దూసుకెళ్తున్న చందన
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఇంటర్ విద్యార్థిని



సాధించిన పతకాలు, తల్లిదండ్రులతో చందన



కరాటే పోటీలో సహచర విజేతలతో.. (ఫైల్)

గుండాల: లక్ష్యాన్ని చేరాలనే పట్టుదల.. అందుకు తగినట్లుగా శ్రమిస్తే ఏ ప్రాంతం నుంచి వచ్చిన వారైనా విజయాలు సొంతం చేసుకుంటారు. ఇందుకు ఉదాహరణగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన కొండపల్లి జంపన్న – శారదల కుమార్తె చందన నిలుస్తోంది. చిన్న వయస్సు నుంచే కరాటేపై ఆసక్తితో శిక్షణ పొందిన ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సొంతం చేసుకుంది.

8వ తరగతి నుంచి పోటీలకు..

గుండాలకు చెందిన కొండపల్లి జంపన్న – శారద కుమార్తె చందన హన్మకొండ ఏఎస్పీఆర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ప్రాథమిక విద్య జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, 7 నుంచి 10వ తరగతి వరకు మహబూబాబాద్ జిల్లా పాఖాల కొత్తగూడెం మండలం గాంధీనగర్ గిరిజన గురుకులంలో చదివింది. అక్కడ కరాటే మాస్టర్ సుధ ద్వారా 7వ తరగతి నుంచే శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత 8వ తరగతి నుంచే వివిధ ప్రాంతాల్లో జరిగే కరాటే పోటీలకు హాజరవుతూ వరుస విజయాలు సాధిస్తోంది.

వరుసగా బంగారు పతకాలు

తొలిసారి 2021లో వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న చందన బంగారు పతకం గెలుచుకుంది. ఆ తర్వాత విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో మరో బంగారు పతకంతో పాటు వైట్ బెల్ట్ స్వీకరించింది. 2022లో ఖమ్మంలో జరిగిన ఏషియన్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ అండర్–15 విభాగంలో పోటీ పడి బంగారు పతకం సాధించింది. అదే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన నేషనల్ ఎఫ్ఎస్‌కేఏ కరాటే చాంపియన్ షిప్ అండర్–15 విభాగంలోనూ బంగారు పతకం గెలుచుకుంది. ముంబైలో 2022లో జరిగిన ఫునాకోషి షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీలు, ఢిల్లీ, గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ బంగారు పతకాలు స్వీకరించింది. ఇటీవల గోవాలో జరిగిన వరల్డ్ కప్ కరాటే చాంపియన్ షిప్ అండర్–18 విభాగంలో పాల్గొనగా ఎనిమిదో పతకం సొంతమైంది. అంతేకాక త్వరలోనే అంతర్జాతీయ స్థాయిలో ఎంపికై మలేషియాలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు చందన అర్హత సాధించింది. కాగా, వరుస బంగారు పతకాలతో కరాటేలో సత్తా చాటుతున్న ఆమెకు మెరుగైన శిక్షణ ఇప్పించేలా అధికారులు సహకరిస్తే దేశానికి పేరు తీసుకొస్తుందని పలువురు కోరుతున్నారు. గుండాల ప్రాంతం నుంచి కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు ఉండగా, కరాటేలో మాత్రం మొదటి క్రీడాకారిణి చందనే కావడంతో పలువురు అభినందిస్తున్నారు.

సగం రోడ్డు మేర ధాన్యమే..

ఇల్లెందురూరల్: వానాకాలంలో సాగుచేసిన వరి, మొక్కజొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. కోతలు పూర్తిచేసిన రైతులు పంట క్షేత్రాలను యాసంగి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యాన చేలలో ఖాళీ లేకపోవడంతో మొక్కజొన్న, వరి ధాన్యాన్ని రహదారులపై ఆరబోస్తున్నారు. ఇల్లెందు మండలంలోని కొమ్ముగూడెం నుంచి మస్సివాగు వరకు ఎటు చూసినా రోడ్డుకు సగం మేర వడ్లు, మొక్కజొన్న గింజలే కనిపిస్తున్నాయి. వాహన చోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశముంది. గతంలో పలుమార్లు రహదారులపై ప్రమాదాలు జరిగాయి. ఈ నేపథ్యాన వాహనదారుల క్షేమం దృష్ట్యా అన్నదాతలు పంట ఉత్పత్తులను ఆరబోసేందుకు చేన్లలోనే కల్లాలు సిద్ధం చేసుకుంటే మంచిదని పలువురు కోరుతున్నారు.



కొమ్ముగూడెం-మస్సివాగు రహదారిపై ఆరబోసిన మొక్కజొన్న